

సాక్షి గుంటూరు

గురువారం ౹ 9 ౹ జనవరి ౹ 2025



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1716, బ్యాంక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం బుధవారం 566.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,500 క్యూసెక్కులు విడుదలవుతోంది.



70,663 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 68,127 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 70,663 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): అరుణాచలం పవిత్ర పుణ్యక్షేత్రంలో ఈనెల 13న జరుగనున్న పౌర్ణమి గిరిప్రదక్షిణ మహోత్సవాలకు ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ తెలిపారు. గుంటూరు -2 డిపో నుంచి ఈనెల 11 రాత్రి 9.15 గంటలకు బస్సు బయలుదేరి 12వ తేదీ కాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకున్న అనంతరం అదే రోజు రాత్రి అక్కడి నుంచి బయలుదేరి అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. 13వ తేదీన భక్తులు గిరిప్రదక్షిణలు చేసుకుని, అరుణాచలేశ్వరుని దర్శనం అనంతరం అదేరోజు సాయంత్రం అరుణాలచలంలో బయలుదేరి 14వ తేదీ ఉదయం 6 గంటలకు గుంటూరు చేరుకుంటుందని వివరించారు. ఒక్కో టికెట్ ధర రూ. 2,420లు అని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7382897459 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మహంకాళీ అమ్మవారి గుడి హుండీ ఆదాయం లెక్కింపు



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజుకొండూరు గ్రామంలోని మహంకాళీ అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సునీల్ కుమార్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీలోని కానుకలను గుంటూరు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.వెంకట శ్రీనివాసులు ఆధ్వర్యంలో తెరిచి లెక్కించగా రూ. 12,66,254 ఆదాయం వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త డి.రంగ ప్రసాద్ పాల్గొన్నారు.

46 మందికి పీహెచ్ఎన్‌లుగా ప్రమోషన్

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో హెల్త్ విజిటర్స్‌గా పనిచేస్తున్న 46 మందికి పబ్లిక్ హెల్త్ నర్సులుగా ప్రమోషన్ లభించింది. బుధవారం గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందజేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ గోవవరపు స్టాన్లీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: ఎంపీహెచ్ఈఓ, సీహెచ్ఓల డైరీని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉద్యోగులకు ప్రభుత్వ జీవోల గురించి, జిల్లా వ్యాప్తంగా ఉన్న వైద్య సిబ్బంది వివరాలతో సమాచారం తెలుసుకునేలా రూపొందించారని అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కె.శేషగిరి రాజు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బి.ఆనందరావు, జిల్లా ప్రెసిడెంట్ టి.సాంబయ్య, జిల్లా సెక్రెటరీ ప్రసాద స్వామి , జిల్లా ట్రెజరర్ నూనె రామకృష్ణరావు, డెప్యూటీ డెమో ఎన్.వెంకటేశ్వర్లు, పున్నారెడ్డి, గణేష్, నరేంద్ర, విజయకుమార్ పాల్గొన్నారు.

80 ఆవులు పట్టివేత

మంగళగిరి: విజయనగరం నుంచి చిలకలూరిపేట మీదుగా చెన్నైకి గోవులను తరలిస్తున్న కంటైనర్‌ను హైందవ సంఘాలు అడ్డుకున్నాయి. మంగళగిరి కాజ టోల్‌గేట్ వద్ద సుమారు 80 గోవులను పోలీసులు పట్టుకున్నారు. గోవులను మంగళగిరి గౌడియ మఠం గోశాలకు తరలించారు. దీనికి సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు రూరల్ పోలీసులు బుధవారం తెలిపారు.

కంది రైతుల పేర్లు నమోదుకు గడువు నేడు

నరసరావుపేట: రైతులు తాము పండించిన కందులను రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయించాలనుకుంటే తమ పేర్లను సీఎం యాప్‌లో నమోదు చేసుకోవడానికి ఈ నెల 9 తుది గడువని పల్నాడు జేసీ సూరజ్ గనోరే పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాలో రైతులు 26,908 హెక్టార్లలో కంది వేశారని, 50,879 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు తమ పేర్లను సీఎం యాప్‌లోనూ నమోదు చేసుకోవాలని కోరారు.




బంగారు శంఖం

ముక్కోటికి మంగళాద్రి ముస్తాబు

రేపు స్వామి ఉత్తర ద్వార దర్శనం

- బంగారు శంఖుతో తీర్థం
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ అధికారులు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరిలోని శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఏకాదశి రోజు తెల్లవారుజామున 4 గంటల నుంచే స్వామి దేవేరుల సమేతంగా బంగారు గరుడ వాహనంపై ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. దీనికోసం ఆలయ అధికారులు ఇప్పటికే సన్నాహాలు పూర్తిచేశారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఏకాదశి ఒక్కరోజునే సుమారు లక్ష మంది భక్తులు స్వామిని దర్శించుకునే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.



ముస్తాబైన ఉత్తర ద్వార గోపురం

దక్షిణావృత శంఖం

వైకుంఠ ఏకాదశి రోజున దక్షిణావృత శంఖంతో భక్తులకు తీర్థం అందించడం ఆనవాయితీగా వస్తోంది. 1820లో తంజావూరు మహారాజు వారణాసి యాత్రలో భాగంగా మార్గమధ్యలో లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని బంగారు తొడుగు గల దక్షిణావృత శంఖాన్ని సమర్పించారు. అప్పటి నుంచి ఏటా ముక్కోటి ఏకాదశి రోజున ఈ శంఖంతో లక్ష్మీ నరసింహస్వామికి అభిషేకం చేస్తారు. ఆ శంఖం ద్వారానే భక్తులకు తీర్థం అందిస్తారు. ఈ శంఖం నుంచి నిత్యం ఓంకార నాదం వినిపిస్తుంటుందని చెబుతారు.

ఏర్పాట్లు పూర్తి



భక్తులకు ఎటువంటి ఆటంకాలు, ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. పిల్లలకు, వృద్ధులకు క్యూలైన్లు ఏర్పాటు చేశాం. పిల్లలకు బిస్కెట్లు, మజ్జిగ, మంచి నీరు అందిస్తాం. సుమారుగా 70 వేల నుంచి లక్ష మంది భక్తులు రానున్నట్లు అంచనా వేస్తున్నాం.

– రామకోటిరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి

నేడు, రేపు ఉత్సవాలు

మంగళాద్రి క్షేత్రంలో జనవరి 9,10 తేదీల్లో వైకుంఠ ఏకాదశి ఉత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 9వ తేదీ జాగరణ సందర్భంగా భజనలు, అన్నమయ్య సంకీర్తనలు, పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గురువారం స్వామిని జగన్మోహిని రూపంలో అలంకరించి పుష్పక విమానంపై ఊరేగిస్తారు. అర్ధరాత్రి దాటిన తరువాత తిరుమంజన ఉత్సవం నిర్వహిస్తారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా 10న శుక్రవారం వేకువ జామున 4 గంటల నుంచి స్వామి ఉత్తర ద్వార దర్శన భాగ్యం కల్పిస్తారు. మధ్యాహ్నం స్వామి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని ఈ ఏడాది దక్షిణావృత శంఖు తీర్థాన్ని 9, 10 తేదీలలో ఇవ్వనున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

ముక్కోటి సందర్భంగా ఉత్సవ, భద్రతా ఏర్పాట్లను ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం ఆలయ ఈఓ రామకోటిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుమారు 300 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు వినోద్‌కుమార్, శ్రీనివాసరావు, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ సతీష్

అమ్మో ప్రైవేట్ ట్రావెలా..!

సంక్రాంతి ఎఫెక్ట్

- ఇష్టారాజ్యంగా టికెట్ రేట్లు పెంచేసిన యాజమాన్యాలు
- ప్రయాణికులపై ఛార్జీల బాదుడు
- ఒక్కో టికెట్‌పై అదనంగా రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు వసూలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- పట్టించుకోని కూటమి సర్కారు



ప్రత్తిపాడు: ప్రయాణికులను ప్రైవేట్ ట్రావెల్స్ నిలువునా దోచుకుంటున్నాయి. సంక్రాంతి నేపథ్యంలో టికెట్ల ధరలను ఇష్టారాజ్యంగా రెండు రెట్లు, మూడు రెట్లు పెంచేసి అడ్డగోలుగా డబ్బులు దండుకుంటున్నారు. ఇదేమని అడిగే వారు కరువవడం, కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం, నియంత్రించాల్సిన రవాణాశాఖ అధికారగణం కళ్లు తెరవకపోవడంతో పండుగ వేళ ప్రయాణికుల జేబుకు పెద్ద కన్నం పడక తప్పడం లేదు. ఒక్కో టికెట్‌పై అదనంగా వేల రూపాయలను యాజమాన్యాలు వసూలు చేస్తూ ప్రయాణికుల నడ్డి విరుస్తున్నాయి. సాధారణంగా అయితే గుంటూరు నుంచి హైదరాబాద్‌కు నాన్ ఏసీ బస్సుకు రూ.450, ఏసీ బస్సుకు రూ.500, స్లీపర్ ఏసీ బస్సుకు రూ.650 నుంచి రూ.750 వరకు ధరలు ఉంటాయి. హైదరాబాద్ నుంచి గుంటూరుకు నాన్‌ఏసీ రూ.500, ఏసీ రూ.550, స్లీపర్ ఏసీ రూ.600 నుంచి రూ.700 వరకు బస్సును బట్టి రూ.వెయ్యి కూడా ఉంటాయి. కానీ సంక్రాంతి నేపథ్యంలో ఈ టికెట్ వెలను ఆయా ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు అమాంతంగా పెంచేశాయి. ఒక్కో టికెట్‌పై అదనంగా రూ.1,000 నుంచి రూ.2,000 వరకు రేటును వసూలు చేస్తున్నాయి. ఆయా ట్రావెల్స్ వారి వారి ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లలో పెంచిన ధరలను ప్రదర్శిస్తున్నాయి.

సర్కారు చోద్యం

రాష్ట్రంలోని నలుమూలల నుంచి లక్షల మంది ప్రజలు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో నివసిస్తుంటారు. కొందరు స్వగ్రామాల నుంచి వెళ్లి హైదరాబాద్‌లో స్థిరపడిన వారూ ఉంటారు. తెలుగునాట పెద్ద పండుగైన సంక్రాంతికి వారు స్వగ్రామాలకు రావడం సహజం. ఒక్కసారిగా ప్రజలు సంక్రాంతి సెలవులకు స్వగ్రామాలకు పయనం కావడంతో ఈ సమయంలో సగం హైదరాబాద్ ఖాళీ అవుతుంది. దీనిని ఆసరాగా చేసుకుని ట్రావెల్స్ యాజమాన్యాలు దోపిడీకి తెరలేపాయి. అయినా అటు ప్రభుత్వం గానీ ఇటు ప్రభుత్వ అధికార యంత్రాంగం గానీ పట్టించుకోవడం లేదు. ప్రజలు, ప్రయాణికుల నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నా కిక్కురుమనడం లేదు.

హైదరాబాద్ నుంచి గుంటూరుకు..		
బస్సు రకం	ప్రస్తుతం (రూ.లలో)	సంక్రాంతి ముందు (రూ.లలో)
నాన్‌ఏసీ	400-500	1,400-1,700
ఏసీ	500-600	1,800-2,900
స్లీపర్ ఏసీ	500-750	1600-3100
గుంటూరు నుంచి హైదరాబాద్‌కు..		
	ప్రస్తుతం	సంక్రాంతి తర్వాత
నాన్‌ఏసీ	350-450	1,200-2,000
ఏసీ	450-700	1,300-2,800
స్లీపర్ ఏసీ	500-700	1,400-3,000



సంక్రాంతి పండగకు ముందు హైదరాబాద్-గుంటూరుకు డబుల్ చేసి పెంచిన టిక్కెట్ రేట్లు

వైభవంగా శ్రీకృష్ణ దీక్షా మహోత్సవాలు



పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

తెనాలి: స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజీ రోడ్డులో జరుగుతున్న ధనుర్మాస వ్రత ప్రయుక్త శ్రీకృష్ణ దీక్షామహోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి మంగళ శాసనాలతో శరణాగతి గోష్ఠి ట్రస్ట్ ఆధ్వర్యంలో గత నెల 16 నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈ నెల 13వ తేదీ వరకూ జరగనున్నాయి. ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి శరణాగతి మండపం వద్ద విశేష పూజలు చేశారు. గోదాదేవి 24వ పాశురాన్ని ద్రవిడ భాషలో స్తుతించారు. ఇదేరోజున నిర్వహించిన పుష్పయాగంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ రకాల పుష్పాలను తోడ్కొనివచ్చి స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. భగవత్ రామానుజలను పూల పల్లకీపై అలంకరించి ఘనంగా ఊరేగింపు చేశారు. అనంతరం భక్తులందరికీ తీర్థ, అన్న ప్రసాదాన్ని అందజేశారు. శ్రీనరేంద్ర రామానుజ దాసస్వామి కార్యక్రమాలను పర్యవేక్షించారు.



పూల పల్లకీపై శ్రీభగవత్ రామానుజల ఊరేగింపు

కార్పొరేషన్ అధికారి!

కమిషనర్ ద్వంద్వ వైఖరి

- పశ్చిమ ఎమ్మెల్యే మాధవికి పెద్దపీట, తూర్పు ఎమ్మెల్యే నసీర్‌పై చిన్నచూపు
- పీవీకే మార్కెట్ సమావేశానికి అందని ఆహ్వానం
- సంక్రాంతి సంబరాలకూ సమాచారం లేదు
- మేయర్‌కు చెప్పకుండానే ఆహ్వాన పత్రం విడుదల
- కూటమి నేతల నుంచే నిరసన స్వరం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: నగరంలో విభజించు, పాలించు తరహాలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వ్యవహరిస్తున్నారని కూటమి నేతలు మండిపడుతున్నారు. నగరపాలక సంస్థ పరిధిలోకి గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ, ప్రత్తిపాడులో కొంత భాగం వస్తుంది. నగరంలో చేపట్టే కార్యక్రమాల్లో ఖచ్చితంగా ఈ మూడు ప్రాంతాల ప్రజాప్రతినిధులను, స్థానిక ఎంపీ, మేయర్, డెప్యూటీ మేయర్, స్థానిక కార్పొరేటర్‌ని భాగస్వాములను చేయాల్సి ఉంటుంది. అయితే ఇటీవల కార్పొరేషన్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే దీనికి భిన్నంగా జరుగుతున్నాయి. కొన్ని కార్యక్రమాలకు కొందరినే పిలుస్తుండటం, మరికొందరిని ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టడం జరుగుతోంది. దీనికి ఇటీవల గుంటూరు నగరంలోని పీవీకే మార్కెట్ ఆధునికీకరణ పనులపై జరిగిన సమావేశమే నిదర్శనం. మార్కెట్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోకి వచ్చినా అది అందరికీ కీలకమైనది.



సంక్రాంతి సంబరాల కార్యక్రమాలతో నగరపాలక సంస్థ ముద్రించిన బ్రోచర్

ఈ సమావేశానికి పశ్చిమ ఎమ్మెల్యే మాధవిని మాత్రమే పిలిచారు. కనీసం మేయర్‌కు గానీ మిగిలిన కార్పొరేటర్లు ఎవరికీ సమాచారం లేదు.

తూర్పు ఎమ్మెల్యేతో గ్యాప్

పీవీకే మార్కెట్ టెండర్ల దశ దాటి పనులు మొదలు పెట్టాలంటే అందులో ఉన్న 374 షాపులను ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించాలి. ఈ మార్కెట్ పూర్తి కావడానికి మూడేళ్ల కాలం పడుతుంది. అంతవరకూ వేరే చోట ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీన్ని బీఆర్ స్టేడియం, బస్టాండ్, వేంకటేశ్వర విజ్ఞాన మందిరం ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని వర్తకులు కోరుతున్నారు. ఈ మూడు ప్రాంతాలు తూర్పు నియోజకవర్గం పరిధిలోకే వస్తాయి. అటువంటప్పుడు ఇద్దరు ప్రజాప్రతినిధులను కూర్చొబెట్టి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండగా ఉద్దేశపూర్వకంగానే పశ్చిమ ఎమ్మెల్యే ఒక్కరినే పిలిచారని కూటమి నేతలు మండిపడుతున్నారు. గత కొద్దికాలంగా మున్సిపల్ కమిషనర్‌కు తూర్పు ఎమ్మెల్యే నసీర్‌కు మధ్య గ్యాప్ నడుస్తోంది. దీంతో ఆయనను పక్కన పెట్టి కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కూటమి నేతలు ధ్వజమెత్తుతున్నారు.

మేయర్‌కు తెలియకుండానే సంబరాలు!

తాజాగా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాల విషయంలోనూ కమిషనర్ ఏకపక్ష ధోరణతో వ్యవహరిస్తున్నారు. సంక్రాంతి సంబరాల గురించి నగర మేయర్‌కు ఒక్కమాట కూడా చెప్పకుండా నిర్వహణకు ముందుకు వెళ్తున్నారు. సంక్రాంతి సంబరాల బ్రోచర్ ఆవిష్కరణ సందర్భంగా కూడా పశ్చిమ ఎమ్మెల్యేతోపాటు తెలుగుదేశం కార్పొరేటర్లు మాత్రమే ఉన్నారు. తూర్పు ఎమ్మెల్యే హాజరు కాలేదు. ఈ బ్రోచర్‌లో ప్రథమ పౌరుడిగా మేయర్ పేరు వేయాల్సి వస్తుందని అసలు పేర్లు లేకుండా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అంటూ బ్రోచర్ వేశారు. ప్రొటోకాల్ పాటించకుండా అధికార యంత్రాంగం కుంటిసాకులు వెతుకుతుండటం, ఏకపక్షంగా వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది. ఇటీవల కౌన్సిల్‌లో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ వ్యవహరిస్తున్న తీరుపై ప్రజాప్రతినిధులు మండిపడుతున్నారు.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై దాష్టీకం

- డిగ్రీ చదువుతున్న విద్యార్థిని చితకబాదిన పోలీసులు
- బొల్లాపల్లి ఎస్సై తీరుపై తీవ్ర ఆరోపణలు
- కొట్టాక బాధితుడిని ఆసుపత్రికి తరలించిన వైనం

నర్సరావుపేట: వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు, కార్యకర్తలపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో పోలీసుల దాష్టీకాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా బొల్లాపల్లి మండలం వెంకట రెడ్డిపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన కుటుంబంలోని వారిపై దాడులు చేయడమే కాకుండా మరోవైపు పోలీసులు దాడులు చేసి దారుణంగా కొట్టిన ఘటన వెలుగు చూసింది. సేకరించిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వాంకుడావవత్ బాలు నాయక్‌కు చెందిన ఆవులు తమ చేలో పడ్డాయని అదే గ్రామానికి చెందిన గాలం శ్రీను, పవన్ అనే వ్యక్తులు.. బాలునాయక్ భార్య వాకిలీబాయి, కుమారుడు దుర్గాప్రసాద్ నాయక్‌తో గత నెల 2వ తేదీన ఘర్షణకు దిగారు. అప్పుడు పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. తరువాత టీడీపీ నాయకుల ఒత్తిడితో ఈ నెల 7వ తేదీన బాలు నాయక్ కుమారుడైన దుర్గాప్రసాద్ నాయక్‌ను పొలంలో పని చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని బొల్లాపల్లి స్టేషనుకు తరలించారు. అదే రోజు పోలీసులు తమదైన శైలిలో దుర్గాప్రసాద్ శరీరంపై వాతలు తేలేటట్లు కొట్టడంతో సొమ్మసిల్లి పడిపోయాడు. కంగారుపడిన పోలీసులు వెంటనే బొల్లాపల్లిలోని ప్రభుత్వ వైద్యశాలకు దుర్గాప్రసాద్‌ను తరలించారు. అక్కడ లాభం లేదని, మెరుగైన చికిత్స కోసం వినుకొండ తరలించాలని వైద్యులు సూచించారు. వెంటనే ప్రైవేటు అంబులెన్సులో వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి బాధితుడిని మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఎస్సై బాలకృష్ణ అత్యుత్సాహం

బొల్లాపల్లి ఎస్సై బాలకృష్ణ వ్యవహారశైలిపై మొదటి నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి. అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తూ వేధిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా వెంకటరెడ్డిపురం గ్రామం కేసులో కూడా దుర్గాప్రసాద్ నాయక్‌ను తీవ్రంగా కొట్టారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. డిగ్రీ చదువుతున్న దుర్గాప్రసాద్ నాయక్ భవితవ్యం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పోలీసుల తీరును తప్పుపడుతూ న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. దీనిపై దుర్గాప్రసాద్ బాబాయి కాశోజి నాయక్ మాట్లాడుతూ న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని'' తెలిపారు.

ట్రామా నోడల్ ఆఫీసర్‌గా డాక్టర్ నారాయణరావు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ట్రామా కేర్ సెంటర్ నోడల్ ఆఫీసర్(పర్యవేక్షణ అధికారి)గా ఆస్పత్రి ఆర్థోపెడిక్ వైద్య విభాగాధిపతి డాక్టర్ వి.వి. నారాయణరావును నియమిస్తూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడి జీజీహెచ్ క్యాజువాలిటీకి వచ్చే బాధితులకు సత్వర వైద్యం అందించేలా నోడల్ ఆఫీసర్ పర్యవేక్షణ చేయాల్సి ఉంది. రోజూ క్యాజువాలిటీకి వెళ్లి ట్రామా కేర్ సెంటర్ పనితీరును పర్యవేక్షించాల్సి ఉంది. ట్రామా చికిత్సకు వచ్చిన రోగులకు, బాధితులకు సత్వర వైద్యం అందుతోందా లేదా, డ్యూటీ డాక్టర్లు, స్టాఫ్ సమయపాలన పాటిస్తున్నారా లేదా వంటి పనులను చూడాల్సి ఉంది.

ఆర్వోబీకి రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్

రూ.107.79 కోట్లు మంజూరు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గడ్డిపాడు వద్ద ఇన్నర్ రింగు రోడ్డు ఆర్‌ఓబీకి కేంద్ర రైల్వే శాఖ ఆమోదం పలికింది. నిర్మాణానికి రూ.107.79 కోట్లు మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గడ్డిపాడు వద్ద ఎల్‌సీ గేట్ నంబర్ 3 అతి పెద్ద రైల్వే గేటుగా గుర్తింపు పొందింది. ఇక్కడ ఇన్నర్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా నాలుగు లేన్ల ఆర్వోబీ కోసం రైల్వే శాఖ గత ఏడాది నవంబర్ నెలలో ఉన్నతాధికారులకు ప్రణాళికలు పంపింది. ఇప్పటికే శంకర్‌విలాస్ ఆర్వోబీపై ట్రాఫిక్‌తో నగర వాసులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఇన్నర్ రింగ్ రోడ్డు ఆర్వోబీకి నిధులు మంజూరు చేయడం శుభపరిణామమని, దీని నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ కొంత మేర నియంత్రించే అవకాశం ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. ఇదిలా ఉంటే నిర్మాణ పనులు ప్రారంభం కావాలంటే ముందుగా రైల్వే జీఎం కార్యాలయం నుంచి ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పది రోజుల్లో ఈ ప్రక్రియ మొదలవుతుందని అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత టెండర్లు పిలిచి పనులు మొదలు పెడతారని పేర్కొంటున్నారు. ఆర్వోబీ కోసం స్థల సేకరణ చేయాల్సి ఉంది. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరగనుంది.



ఇన్నర్ రింగ్ రోడ్డు గడ్డిపాడు వద్ద గల ఎల్‌సీ గేట్ నంబర్ 3 (ఫైల్)

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,200** గరిష్ఠం : రూ. **3,000**

మోడల్ ధర రూ. **2,900**

చెరకుకు ప్రత్యామ్నాయంగా షుగర్‌బీట్ సాగు

- ఎన్జీ రంగా వర్సిటీ వీసీ శారదజయలక్ష్మి
- పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశంలో ఉద్ఘాటన



ఉత్తమ అవార్డులను అందజేస్తున్న వీసీ డాక్టర్ శారదజయలక్ష్మీదేవి తదితరులు

గుంటూరు రూరల్: చెరకు పంటకు ప్రత్యామ్నాయంగా షుగర్‌బీట్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎన్జీరంగా యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి చెప్పారు. బుధవారం నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని వర్సిటీ ఆడిటోరియంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న 54వ విస్తరణ, పరిశోధన, సలహా మండలి సమావేశం ప్రారంభమైంది. పరిశోధన స్థానం సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి శారదజయలక్ష్మీదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023లో వర్సిటీ అభివృద్ధి చేసిన మూడు వంగడాలను జాతీయస్థాయిలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా విడుదల చేశామని వివరించారు. ప్రస్తుతం రైతాంగాన్ని తెగుళ్ల ఇబ్బంది పెడుతున్నాయని వివరించారు. ఈ తెగుళ్లను తట్టుకునే వంగడాల తయారీ శాస్త్రవేత్తల బాధ్యతని సూచించారు. సమావేశంలో డైరెక్టర్ అండ్ అగ్రికల్చర్ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు, పరిశోధన స్థానం సంచాలకులు సత్యనారాయణ, ఇమినెంట్ సైంటిస్ట్, పరిశోధన స్థానం మాజీ సంచాలకులు డాక్టర్ ఏఎస్ రావు, మాజీ విస్తరణ సంచాలకుడు డాక్టర్ పి.రాంబాబు, మాజీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్ఎల్ వాసంతి, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ ఫామ్ రీసెర్చ్ పెదవేగి నుంచి డాక్టర్ ఎంవీ ప్రసాద్ ప్రసంగించారు. అనంతరం పలు వ్యవసాయ పుస్తకాలను విడుదల చేశారు. ఏఎస్ఆర్ మొబైల్ యాప్‌ను పాడేరు ఏరువాక కేంద్రం నుంచి విడుదల చేశారు. ఉత్తమ ప్రాంతీయ పరిశోధన స్థానంగా లాంఫాంకు అవార్డు అందించారు. ఉత్తమ వ్యవసాయ పరిశోధన స్థానంగా రాగోలు, ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా కొండెపూడి, ఉత్తమ ఏరువాక కేంద్రంగా ఏలూరు కేంద్రాలను గుర్తించి అవార్డులు ఇచ్చారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కేల ద్వారా ధాన్యం కొనుగోలు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

నరసరావుపేట రూరల్: రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని పాలపాడు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఏవో.. గ్రామంలోని మొక్కజొన్న పంటను పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో అన్నదాతలతో సమావేశం నిర్వహించారు. రైతు సేవా కేంద్రం ద్వారా ఎరువులను సరఫరా చేయాలని, ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. దీనిపై డీఏవో మాట్లాడుతూ అవసరాన్ని బట్టి ఎరువులు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. జిల్లాలో ఐదు వేలకుగాను, ఇప్పటికే 3,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. మరో ఐదు వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రభుత్వ అనుమతి కోరామని వివరించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణపై దృష్టి సారించాలని తెలిపారు. గొంగళి పురుగు ముఖంపై తిరగబడిన ఆకారంలో తెల్లని చారలను కత్తెర పురుగు కలిగి ఉంటుందని తెలిపారు. ఈ పురుగు నివారణకు ఎకరానికి లీటరు 1500 పీపీఎం వేపనూనె, 10,000 పీపీఎం వేపనూనె శాతం 200ఎంఎల్ పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీసీ డీడీఏ ఎం.శివకుమారి, ఏడీఏ పి.మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబు, డీసీ చైర్మన్ పులిమి రామిరెడ్డి, వీఏఏ ఎం.బోస్, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దేహదారుఢ్య పరీక్షల్లో 169 మంది అర్హత



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): నగరంపాలెంలోని పోలీస్ పరేడ్ మైదానంలో కొనసాగుతున్న కానిస్టేబుళ్ల అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. అభ్యర్థుల వివరాలు, ఏర్పాట్లు, పోటీల నిర్వహణపై పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బుధవారం 305 మంది హాజరుకాగా, 74 మంది ధ్రువపత్రాలు తీసుకురాకపోవడంతో వెనుదిరిగారు. 231 మందికి శరీర కొలత పరీక్షలు నిర్వహించగా, వారిలో 24 మంది చాతి, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో నిష్క్రమించారు. 1600 మీటర్ల పరుగు పందెం పోటీలను 205 మందికి నిర్వహించగా, 179 మంది అర్హత సాధించారు. వారికి 100 మీటర్ల పరుగు పందెం పోటీలు జరగ్గా 100 మంది అర్హత పొందారు. లాంగ్ జంప్ పోటీల్లో 168 మంది అర్హత సాధించారు. 231 మంది కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా, 169 మంది అర్హత సాధించారు. జిల్లా ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), హనుమంతు (ఏఆర్) పర్యవేక్షించారు.

ఆర్‌ఎంపీలు నిబంధనలు పాటించాలి

నరసరావుపేట టౌన్: నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్‌ఎంపీలను డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయంలో జిల్లాలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతి లేకుండా రక్తపరీక్షల ల్యాబ్‌లు నిర్వహిస్తే సహించేది లేదన్నారు. తనిఖీ సమయంలో ఆర్‌ఎంపీల వద్ద పెద్ద ఎత్తున ఫిజీషియన్ శాంపిల్స్ లభ్యమవుతున్నాయని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సూచనలు, సలహాలు ఇచ్చి ప్రాథమిక వైద్యం మాత్రమే అందించి పెద్ద వైద్యశాలలకు పంపాలని సూచించారు. నిబంధనలకు మించి వైద్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రేపు వైకుంఠపురంలో ఉత్తరద్వార దర్శనం

- ముక్కోటి సందర్భంగా చురుగ్గా సన్నాహాలు
- 15 వేల మంది తరలివచ్చే అవకాశం



వైకుంఠపురం దేవస్థానం

తెనాలి: కళలకు నిలయంగా విలసిల్లిన తెనాలిలో శ్రీలక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురం రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా విలసిల్లుతోంది. పట్టణానికి దక్షిణంగా ప్రశాంత వాతావరణంలోని వైకుంఠపురంలో వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తుల కొంగుబంగారంగా నిలిచింది. నిత్యకల్యాణం పచ్చతోరణంతో విలసిల్లే కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరుడు, భక్తాభీష్ట వరదుడై లక్ష్మీపద్మావతి సమేతంగా, పరమ ప్రసన్న శోభలు చిందిస్తూ, బహుముఖ వైభవోపేతుడై వెలుగొందుతున్నాడు. వేలాది మంది భక్తులు, దాతల వితరణ, పాలకవర్గాల కృషితో పవిత్ర యాత్రాస్థలంగా దినదినప్రవర్ధమానంగా ఎదుగుతున్న వైకుంఠపురం దేవస్థానం ముక్కోటి ఏకాదశి వేడుకలకు సన్నద్ధమవుతోంది. ఈనెల పదో తేదీన శుక్రవారం ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. ఆరోజు స్వామి, అమ్మవార్లు ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై వేంచేసి ఉండి భక్తులకు దర్శనమిస్తారు. ఆరోజు తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుంది. ఉత్తర ద్వారంలో, మూలవరుస దర్శించుకునేందుకు వీలుగా ప్రస్తుతమున్న క్యూలైన్లతోపాటు అదనంగా క్యూలైన్లు, ఎండ తగలకుండా చలువ పందిళ్లను సిద్ధం చేస్తున్నారు. ఉచిత దర్శనంతోపాటు రూ.100, రూ.300 దర్శన ప్రవేశాలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేశారు. దర్శనానంతరం భక్తులకు దక్షిణావృత బంగారు శంఖుతీర్థం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనరు, కార్యనిర్వహణాధికారి అనుపమ, ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ కుంభం సాయిబాబు వెల్లడించారు. ఉత్తర ద్వార దర్శనం సందర్భంగా ఏడు వేలమంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించేందుకు సన్నాహాల్లో ఉన్నారు. మొత్తంమీద ఆరోజు 10 వేల నుంచి 15 వేల మంది భక్తులు విచ్చేసే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు.

దక్షిణ భారత స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు గుంటూరు ప్రాజెక్టు

శారదానికేతన్ విద్యార్థినుల 'గగన్‌యాన్ మిషన్' నమూనా ఎంపిక



ఇటీవల జరిగిన జిల్లాస్థాయి ప్రదర్శనలో విద్యార్థినులను అభినందిస్తున్న డీఈవో రేణుక, హెచ్‌ఎం ఉషాకుమారి, ఆరిఫ్ బేగ్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు బ్రాడీపేటలోని శారదానికేతన్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎండీ అనీసాబేగం, ఎస్.ఈర్పిత రూపొందించిన గగన్‌యాన్ మిషన్ ప్రాజెక్టు దక్షిణ భారతదేశ స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈనెల 4న గుంటూరులో జరిగిన జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్రస్థాయికి ఎంపికైన "గగన్‌యాన్ మిషన్" తాజాగా మంగళ, బుధవారాల్లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో దక్షిణ భారతదేశ స్థాయికి అర్హత సాధించింది. ఈనెల 21 నుంచి 25 వరకు పుదుచ్చేరిలో ప్రదర్శన జరగనుంది. శారదానికేతన్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినులు ఎండీ అనీసాబేగం, ఎస్.ఈర్పిత గైడ్ టీచర్ ఆరిఫ్ బేగ్ సహకారంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అంతరిక్షంలోకి మానవులు ప్రయాణించేందుకు వీలుగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సొంతంగా చేపడుతున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు గగన్‌యాన్ విశేషాలతో రూపొందించిన ఈ ప్రాజెక్టు సందర్శకులను విశేషంగా ఆకట్టుకోవడంతోపాటు న్యాయ నిర్ణేతల ప్రశంసలు అందుకుంది. అంతరిక్షంలోకి మనుషులను తీసుకువెళ్లి, సురక్షితంగా తీసుకువచ్చేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనలపై నమూనా ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థినులు గగన్‌యాన్ మిషన్ విశేషాలను చక్కగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.ఉషాకుమారితోపాటు గైడ్ టీచర్ ఆరిఫ్ బేగ్, విద్యార్థినులను అభినందించారు.

రేపు తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ చెప్పారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

BEFORE THE HONOURABLE DEBT RECOVERY TRIBUNAL
H.No. 31-31-21, Saibaba street, Dabagardens, Visakhapatnam -530020.

O.A.No. 484/2024

Between:
Union Bank of India (Erstwhile Andhra Bank) represented by its Branch Manager, Asset Recovery Branch, Vijayawada, Krishna District, A.P.-520001. ...**Applicant Bank**

And:
Sri Etukuri Showri Rayulu and four others ... **DEFENDANTS**

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

Defendants 1, 3 to 5

1. **Sri Etukuri Showri Rayulu, S/o. Praksam residing at** Flat No. GF-2, Kandala Apartments, 1st Lane, Behind Lion's Club Hospital, Lakshmipuram, Guntur-522 006
3. **Sri Avula Sankara Rao, S/o Venkateswara Rao, residing at** D.No. 15-9-87, 5th Lane, Vonbha Nagar, Guntur-522 001.
4. **Smt. Avula Revathi Latha W/o Sankara Rao, residing at** D.No. 15-9-87, 5th Lane, Vonbha Nagar, Guntur-522 001.
5. **Smt. Etukuri Marthamma, W/o. Sri Etukuri John Rayulu,** Flat No. GF-2, Kandala Apartments, 1st Lane, Behind Lion's Club Hospital, Lakshmipuram, Guntur-522006.

Whereas the applicant has instituted an application under section 19 of the Recovery of Debts due to Banks and Financial Institutions Act 1993 against the above defendants for recovery of loan amount together with current and future interest, costs and for other reliefs

The above mentioned defendant/s are therefore hereby directed to appear before this Tribunal in person or through an advocate or duly authorized agent, in support of your defense to show cause on **07.02.2025** at **10.30 A.M** as to why relief's prayed for should not be granted.

Take notice that in case of default the application will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this the day of 6th January 2025 at Visakhapatnam.

Signature of the officer Authorised to issue summons

వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌పై దాడి.. కేసు నమోదు

యడ్లపాడు: వక్ఫ్‌బోర్డు భూములను పరిశీలించేందుకు వెళ్లిన ఆ శాఖ ఇన్‌స్పెక్టర్‌పై కొందరు దాడి చేశారు. దీనిపై యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. గుంటూరు జిల్లా వేములూరుపాడుకు చెందిన షేక్ కరీముల్లా బాషా పల్నాడు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌గా మూడేళ్లుగా పనిచేస్తున్నారు. కొండవీడు గ్రామంలో ఉన్న పురాతన దర్గా హజరత్ బురావద్దీన్‌బాబా వారి దర్గా కింద వక్ఫ్ బోర్డుకు చెందిన 87.20 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. ప్రతి మూడేళ్లకు ఒకసారి జరిగే వేలం పాటలో ఈ మాన్యం భూముల్ని దక్కించుకున్న రైతులు ఏటా శిస్తు చెల్లిస్తూ కౌలు చేసుకుంటారు. సదరు భూములకు మూడేళ్లుగా శిస్తు చెల్లించనందునక్షేత్రస్థాయి సందర్శనకు మంగళవారం మధ్యాహ్నం కరీముల్లా బాషా వెళ్లగా కాకర్లపూడి మాధవరావు, మరో ఐదుగురు కలసి దాడి చేశారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదైంది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TOLET COMMERCIAL

■ బాపట్ల జిల్లా, ఇంకొల్లు లో దాల్‌మిల్ డబుల్ సెక్షన్ 78 HP కెపాసిటీ మోటార్, జనరేటర్‌తో అద్దెకు ఇవ్వబడును. ఫోన్: 94418 84582

SERVICES

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల వ్యాపార, ప్రాజెక్ట్‌ల, వ్యక్తిగత, వ్యవసాయ, విద్య రుణాల సలహాలకు సంప్రదించండి DMA స్వాగతం. జీతం + కమీషన్. ✆ 9671637906.

CHANGE OF NAME

■ I, AKELLA VENKATA SIVA RAMA PRASAD (Old Name), S/o. AKILLA V S SARMA, R/o Door No: 3-27-1, Flat No.503, Sri Balaji Heights, Ravindra Nagar, 1st Lane, Guntur - 522006, A.P. I have changed my name as AKILLA SIVA RAMA PRASAD (New Name), S/o. AKILLA V S SARMA, Hereafter my name is known as AKILLA SIVA RAMA PRASAD (New Name), S/o. AKILLA V S SARMA.

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

HOTEL LEASE / RENT

■ బాపట్ల సిటీ హైవే ప్రక్కన నూతనంగా నిర్మించిన G+1 హోటల్ & రెస్టారెంట్, కిచెన్, ఫర్నిచర్‌తో కలిపిమొత్తంగా అమ్మకమునకుగా లీజుకు ఇవ్వబడును: 8918430819, 9493125578

WANTED

■ విశ్రాంతి ఉద్యోగులకు శుభవార్త. గుంటూరు నగరంలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థలో కలిసి పనిచేయుటకు 10th పాస్ 40సం॥పై వయస్సు వారు కావలెను: 9490127118

■ బెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అద్దంకిలో భాష్యం వారి గ్రీన్ సిటీ నందు పూర్తిగా అభివృద్ధి పరచిన అప్రూవ్ వెంచర్‌లో 3 సెంట్ల నుండి హౌసింగ్ ప్లాట్స్ కలవు. సెంటు రూ.4 లక్షల 50 వేలు మాత్రమే తక్షణ గృహ నిర్మాణానికి అనువైన ప్రదేశం. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. సంప్ర: రమాదేవి: 80188 08724

■ తెనాలిలో టైపింగ్ MS ఆఫీస్ Exelలో 3 సం॥ అనుభవం గల సిస్టమ్ ఆపరేటర్ (Male) కావలెను. జీ.10-15వేలు, లోకల్‌వారికి ప్రాధాన్యం. ఐతానగర్,తెనాలి. 9490157852, 7815829957

■ వర్క్‌ఫ్రమ్‌హోమ్ అవకాశం, ఇంట్లో పని చూసుకుంటూ తీరిక సమయంలో Online లో వర్క్ చేసుకోవచ్చు.2 or 3గం॥ 20K-30K. వ: 20-50సం॥: 8500348714, 8515730117

■ గుంటూరు ప్రఖ్యాతి గాంచిన ఎలక్ట్రికల్ 2 వీలర్ కంపెనీ నందు పనిచేయుటకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్ మరియు సేల్స్ ఎగ్జిక్యూటివ్ సేల్స్ మేనేజర్ కావలెను. వివరాలకు: 9866515888

■ గుంటూరు పట్టాభిపురం మసీదు ఎదురు, స్వామి థియేటర్‌కు దగ్గరగా గల దంత వైద్యశాల నందు లేడీ స్టాఫ్, BDS డాక్టర్, PRO (మార్కెటింగ్) కావలెను. ఫోన్: 9704370625

■ గర్ల్స్ హాస్టల్‌లో పనిచేయుటకు ఫిమేల్ హాస్టల్ ఇన్‌చార్జిలు కావలెను. అర్హతలు: ఇంటర్/డిగ్రీ చదివి ఉండవలెను. జీతము: 10,000/- నుండి 12,000/- వరకు ఇవ్వబడును. వయస్సు: 20-40 సంవత్సరాలు పైన. భోజనం మరియు వసతి కల్పించబడును. పనిచేయు స్థలం గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజీ 9100024059

■ రూ. 5,000/- జీతం 10 to 2 pm అనుభవమున్న టెలికాలర్స్, డోర్ టు డోర్ బిజినెస్ కార్డ్స్ పంచుటకు జీతం: 10,000/- pm కొరిటిపాడు రోడ్డు, గుంటూరు ✆ 90524 70111

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4లైన్స్)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌కు పల్నాడు విద్యార్థి




అంబుబ్యాగ్ నమూనా ప్రదర్శనతో విద్యార్థి దిలీప్

నరసరావుపేట ఈస్ట్: దక్షిణ భారత సైన్స్ ఫెయిర్ 2024-25 కు పల్నాడు జిల్లా దాచేపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థి ప్రజాపతి దిలీప్ ఎంపికైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ బుధవారం తెలిపారు. విజయవాడలో ఈ నెల 7, 8వ తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలో దిలీప్ ప్రదర్శించిన అంబు బ్యాగ్ నమూనా ఎంపికైనట్టు వివరించారు. రాష్ట్ర సమగ్ర శిక్ష సంచాలకుడు బి.శ్రీనివాస్, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎం.కృష్ణారెడ్డి చేతుల మీదుగా దిలీప్ బహుమతి అందుకున్నాడని తెలిపారు. అంబు బ్యాగ్ ద్వారా ఆస్మా రోగులకు అత్యవసర సమయాలలో శ్వాస అందించేందుకు వీలుంటుందని, టీచర్ గైడ్ ఉపాధ్యాయుడు ప్రసాద్ సహకారంతో దిలీప్ దీనిని రూపొందించాడని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆస్మా రోగులకు ఉపయోగపడే కృత్రిమ శ్వాస మిషన్ కొనుగోలు చేయాలంటే రూ. 2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు అవుతుందని చెప్పారు. దిలీప్ దీని తయారీకి డ్రిల్లింగ్ మిషన్, పిస్టన్, ప్రజర్ బ్యాగ్ ఉపయోగించాడన్నారు. దీని తయారీకి కేవలం రూ.3 వేలు మాత్రమే అవుతోందని తెలిపారు. ఆసుపత్రులు అందుబాటులో లేనిచోట, పర్వత ప్రాంతాలలోని అత్యవసర సమయాలలో ఇది రోగులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి పుదుచ్చేరిలో జరగనున్న దక్షిణ భారత విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో దిలీప్ ఈ నమూనాతో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. విద్యార్థి దిలీప్, గైడ్ టీచర్ ప్రసాద్‌ను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, డీఈఓ చంద్రకళ తదితరులు అభినందించారు.

విభిన్న రంగాల్లో ప్రావీణ్యం అవసరం

- పల్నాడు డీఈవో ఎల్. చంద్రకళ
- ఘనంగా రంగోత్సవ్-2025 పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో డీఈవోలు ఎల్. చంద్రకళ, సీవీ రేణుక

యడ్లపాడు: విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా విభిన్న రంగాల్లో ప్రావీణ్యం పెంచుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యాశిక్షణ సంస్థ ప్రిన్సిపల్, పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ పేర్కొన్నారు. అప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకోగలుగుతారని తెలిపారు. మండలంలోని బోయపాలెం డైట్ కళాశాల ప్రాంగణంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి రంగోత్సవ్-2025 పోటీలను బుధవారం గుంటూరు డీఈవో సీవీ రేణుకతో కలసి ఆమె ప్రారంభించారు. ఈ పోటీల్లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జానపద నృత్యం, రంగవల్లులు, చేతిరాత, చిత్రలేఖనం, స్లోగన్ రైటింగ్, డిజిటల్ పోస్టర్ డిజైన్, క్విజ్, రోల్‌ప్లే తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభా నైపుణ్యాలు చాటుకున్నారు. ప్రారంభోత్సవ సమావేశంలో డీఈవో ఎల్. చంద్రకళ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. పోటీలో ఈ ఏడాది నుంచి స్లోగన్ రైటింగ్, కంప్యూటర్‌లో డిజిటల్ పోస్టర్ తయారుచేయడం వంటి అంశాలు చేరడం విశేషమన్నారు. అనంతరం ఆయా విభాగాల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. డైట్ సీనియర్ లెక్చరల్ ఎస్ఎం సుభాని, కో ఆర్డినేటర్ డాక్టర్ కె.ప్రసాద్, పి.పోలేరు, ప్రభాకరరెడ్డి, యోగేశ్వరరావు, వై. శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఎం.సౌజన్య, సమేధ, యాస్మిన్ పాల్గొన్నారు.

విజేతల వివరాలు...

జానపదం, పోస్టర్, చిత్రలేఖనం, స్లోగన్ రైటింగ్, రోల్‌ప్లే విభాగాల్లో ఓక్‌ల్యాండ్‌స్కూల్ (నరసరావుపేట), రంగోలిలో వెంకటేశ్వర బాలకుటీర్ (గుంటూరు), క్విజ్‌లో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, చేతిరాతలో జెడ్పీ హైస్కూల్(పొత్తూరు) ప్రథమ స్థానాల్లో నిలిచాయి. వీరితోపాటు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పాఠశాలలు, విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


శివ కోటేశ్వరరావుకు జాతీయస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న శివకోటేశ్వరరావు

గుంటూరు మెడికల్: గుంటూరు కొరిటెపాడుకు చెందిన శివకోటేశ్వరరావుకు జాతీయ స్థాయిలో ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డు దక్కింది. జనవరి 6, 7 తేదీలలో ఒడిశాలో 'హుస్సేన్ ఖాన్ ఏడవ జాతీయస్థాయి వర్క్‌షాప్' జరిగింది. వర్క్‌షాపు చివరి రోజు ఫొటోగ్రాఫర్లకు ఫొటో కంటెస్టును నిర్వహించారు. అందులో గుంటూరు భాను స్టూడియోకి చెందిన శివ కోటేశ్వరరావుకు ఒడిశాలోని బోండాస్ తెగ జీవనశైలిపై తీసిన ప్రత్యేక ఫొటోగ్రాఫ్‌కు ప్రత్యేక జూరీ అవార్డును ఇచ్చి ఘనంగా సన్మానించారు. శివ కోటేశ్వరరావు గతంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని జర్నలిజం విభాగంలో డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సును పూర్తి చేశారు. రాష్ట్రానికి ఇటు గుంటూరు నగరానికి ఫొటోగ్రఫీ రంగంలో మంచి కీర్తి ప్రతిష్ఠలు వచ్చాయని పలువురు ఫొటోగ్రాఫర్లు శివకోటేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు.

ఉపాధ్యాయుడికి జిల్లా ఉత్తమ అవార్డు



మాచర్ల రూరల్: ఉపాధ్యాయులకు ధూళిపాళ్ళ గ్రామంలోని లయోలా కాలేజీలో పల్నాడు జిల్లా స్థాయి ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ముగింపు సందర్భంగా అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, ప్రవేశాల పెంపు తదితర అంశాలపై మాచర్ల మండలంలోని లింగాపురం గ్రామ ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ సైదా ఇచ్చిన ప్రజెంటేషన్‌కు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రథమ బహుమతి డీఈవో అందించారు. డీఈఓ చంద్రకళ, ఎంఈఓ అల్లి సురేష్ ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాటి రాజశేఖర్, రత్నప్రభ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda

అరండల్‌పేట బ్రాంచి
4/3 అరండల్‌పేట, గుంటూరు.
ఫోన్ : 0863-235593, 2232513
మెయిల్: vjgunt@bankofbaroda.com

ఋణగ్రహీతకు డిమాండ్ నోటీసు
(SARFAESI ACT, 2002 లోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్(2) క్రింద)

ఋణగ్రహీతలు : 1) శ్రీ తుమ్మల రామకోటిరెడ్డి, తండ్రి: తుమ్మల వెంకట రామిరెడ్డి, నివాసము: డి.నెం.18-40-36, రెడ్డి వీధి, గుంటూరు బజార్, సంగడిగుంట, గుంటూరు-522003, మరొక చిరునామా: శ్రీ తుమ్మల రామకోటిరెడ్డి, తండ్రి: తుమ్మల వెంకట రామిరెడ్డి, 5ఎ, ఆనంద నిలయం, 533/2, 52/2/1, సంగడిగుంట, గుంటూరు-522002, 2. శ్రీమతి తుమ్మల సమత, భర్త: రామకోటిరెడ్డి, నివాసము: డి.నెం.18-40-36, రెడ్డి వీధి, గుంటూరు బజార్, సంగడిగుంట, గుంటూరు-522003, మరొక చిరునామా: శ్రీమతి తుమ్మల సమత, భర్త: రామకోటిరెడ్డి, 5ఎ, ఆనంద నిలయం, 533/2, 52/2/1, సంగడిగుంట, గుంటూరు-522002, హామీదారులు : శ్రీ [illegible] సంజీవ్ కుమార్, తండ్రి: వై.కొండారెడ్డి, డి.నం. 31-23-7/ఎ, ఫ్లాట్: 4డి, శ్రీ సూర్య ఎన్‌క్లేవ్, ఏలూరు రోడ్డు, మారుతీనగర్, విజయవాడ (అర్బన్)-మాచవరం, కృష్ణా జిల్లా-520004.

విషయము : బ్యాంక్ ఆఫ్ బరోడా, అరండల్‌పేట బ్రాంచ్ నుండి మంజూరు చేయబడిన ఋణ సౌకర్యములు గురించి.

సౌకర్యము	పరిమితి (రూ.)	వడ్డీ రేటు (నోటీసు ఇచ్చిన సమయంలో)	30-11-2024 నాటికి బకాయి	30-11-2024 నాటికి వర్తించని+ నర్వ చేయని+కాంపౌండ్ వడ్డీ
బర్డులోన్ 75420600002094	రూ.30.00 లక్షలు	9.65%	రూ.34,64,485.05	రూ.1,16,285.12

30-11-2024 నాటికి బకాయి మొత్తం: 30-11-2024 నాటికి రూ.34,80,770.17 (అక్షరాల ముప్పై నాలుగు లక్షల ఎనభై వేల ఏడు వందల డెబ్బై రూపాయలు మరియు పైసలు పదిహేడు మాత్రమే)+ ది.01-12-2024 నుండి వర్తించు వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి.

[illegible] సెక్షన్ 13(2) [illegible] తేది.30-11-2024 [illegible] తేది.28-11-2024 నుండి నిరర్థక ఆస్తిగా(ఎన్‌పిఎ) పరిగణించబడినది.

ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా మీరు ఋణం మొత్తం తేది.30-11-2024 నాటికి రూ.34,80,770.17 (అక్షరాల ముప్పై నాలుగు లక్షల ఎనభై వేల ఏడు వందల డెబ్బై రూపాయలు మరియు పైసలు పదిహేడు మాత్రమే) ప్లస్ ది.01-12-2024 నుండి వర్తించని వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి [illegible] బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి చెల్లించవలెను. [illegible] సెక్షన్ 13(13) [illegible] సెక్షన్ 13(2) [illegible]

ఆస్తి వివరములు :

[illegible] "ఆనంద నిలయం" [illegible] 4133.44 [illegible] 41.3/9 [illegible] 34-56 [illegible]

[illegible] "ఆనంద నిలయం" 4వ అంతస్తు [illegible] ఫ్లాట్ నెం.1 [illegible]

స్థలం : గుంటూరు
తేది : 30-11-2024

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
బ్యాంక్ ఆఫ్ బరోడా.